సాక్షి
శ్రీకాకుళం
గురువారం | 29 | ఫిబ్రవరి | 2024



అభివృద్ధి 'బాట'లో..!

పొన్నాడ-బొంతలకోడూరు రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. సుమారు 8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. - 8లో



ప్రతిష్టాత్మకంగా శివరాత్రి ఉత్సవాలు

శ్రీముఖలింగంలో మార్చి 8 నుంచి 11 వరకు శివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించాలని ఆర్‌డీఓ రంగయ్య అధికారులను ఆదేశించారు. - 8లో

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ టెట్ - 2024 పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ నెల 27న ప్రారంభమైన పరీక్షలు మార్చి 6 వరకు కొనసాగనున్నాయి. బుధవారం ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వరా కళాశాలలో మొదటి షిఫ్టులో 100 మందికి 93 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 95 మంది హాజరయ్యారు. చిలకపాలెం శ్రీ శివానీ కాలేజీలో మొదటి షిఫ్టులో 100 మందికి 93 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 91 మంది హాజరయ్యారు. ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఈ పరీక్షలను విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

న్యూస్‌రీల్

ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా రవికుమార్

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రవిసుధాకర్‌కు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జి.రవికుమార్‌ను ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

ఈవీఎం గోదాముల తనిఖీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మెషీన్లను పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆయనతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ కూర్మారావు, టీడీలు ఎస్.చక్రవర్తి, మాళీ ఉన్నారు.

కూర్మనాథాలయ హుండీ ఆదాయం రూ.15,09,395



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

గార: మండలంలోని శ్రీకూర్మనాథాలయ హుండీ కానుకలను బుధవారం లెక్కించగా రూ.15,09,395 ఆదాయం వచ్చిందని ఈవో జి.గురునాథం తెలిపారు. ప్రధానాలయంతో పాటు సమీపంలోని పాతాళ సిద్దేశ్వర ఆలయ హుండీలను 110 రోజులకు గాను లెక్కించగా ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పారదర్శక, దోష రహిత అనుబంధ (సప్లిమెంట్) ఓటర్ల జాబితాల రూపకల్పనకు యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. అనుబంధ ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, రానున్న 2024 ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి 35వ వారపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత వారం మార్పులు, చేర్పులు కోరుతూ 2715 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. పోలింగ్ 75 శాతం మించి ఉండాలనే లక్ష్యంతో ఓటర్లను అవగాహన కలిగించే స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. 80 ఏళ్లు వయస్సు పైబడిన, నడవలేని, మంచం పట్టిన ఓటర్లు, విభిన్న ప్రతిభావంత ఓటర్లకు ఇంటి వద్దే ఓటింగ్ నిర్వహణపై పరిశీలన చేస్తున్నామని చెప్పారు. జిల్లా మొత్తం 49,957 మంది ఓటర్లను గుర్తించామని, వీరు ఇంటి నుంచే ఓటు వేసేందుకు ముందుగా ఫారం-12 డి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, తదితర పంపిణీ చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రత్యేకంగా 18004256625 కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ విభాగం పనిచేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, రౌతు శంకరరావు (వైఎస్సార్ సీపీ), పి.ఎం.జె.బాబు(టీడీపీ), సురేష్‌బాబు సింగ్ (బీజేపీ), సీ-సెక్షన్ సూపరింటెండెంట్ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి 83 కేంద్రాల్లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నో సెల్‌ఫోన్ జోన్‌లుగా సెంటర్లు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- 1480 సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ ప్రకాశరావు, ఆర్ఐఓ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. మార్చి ఒకటి నుంచి మొదలుకానున్న థియరీ పరీక్షలకు ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు/సంస్కృతం/హిందీ పేపర్లతో పరీక్షలు మొదలుకానున్నాయి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. 8.30 నుంచి పరీక్ష కేంద్రం లోపలికి అనుమతిస్తారు. 9 గంటల తర్వాత నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు అర గంట ముందుగా చేరుకోవాలని సూచిస్తున్నారు.

కేంద్రానికో కీప్యాడ్ ఫోన్..



ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం నో సెల్‌ఫోన్ జోన్‌లగా ప్రకటించింది. విద్యార్థులతో పాటు ఇన్విజిలేటర్లు, సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, స్క్వాడ్‌లు, చివరకు తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు కేంద్రం వెలుపలే ఉంచాల్సి ఉంటుంది. పరీక్షల నిర్వహణలో సందేహాలు, అధికారులకు సమాచారం అందజేత, ఇతరత్రా అవసరాల నిమిత్తం కేంద్రానికి ఒకటి చొప్పున కీప్యాడ్ ఫోన్లను అధికారులు అందజేశారు. ఇవి సీఎస్‌ల పర్యవేక్షణలో ఉండనున్నాయి.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ఇంటర్ పరీక్షలకు 83 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. ఇందులో శ్రీకాకుళం నగరంలోనే అత్యధికంగా 16 కేంద్రాలు ఉన్నాయి. ఆ తర్వాత పలాసలో 7, నరసన్నపేటలో 6 కేంద్రాలు, టెక్కలి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో 4, మిగిలిన మండలాల్లో రెండు మూడు చొప్పున కేంద్రాలున్నాయి.
- జిల్లా వ్యాప్తంగా 45,702 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో జనరల్ విద్యార్థులు 43,071 మంది, ఒకేషనల్ 2,631 మంది ఉన్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 19,937 మంది, ద్వితీయ సంవత్సరం 25,765 మంది విద్యార్థులు ఉన్నారు.



తరగతి గదిలో సన్నాహక పరీక్షలు రాస్తున్న ఇంటర్ విద్యార్థులు

- పరీక్ష నిర్వహణకుగాను కలెక్టర్ అధ్యక్షతన హైపవర్ కమిటీ సభ్యులు, 83 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 83 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 33 మంది కస్టోడియన్లను నియమించారు. 4 సిట్టింగ్ స్క్వాడ్‌లు, 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. 1650 మంది వరకు ఇన్విజిలేటర్లను వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, కలెక్టర్ సూచనల మేరకు జిల్లా స్పెషల్ ఆఫీసర్/డీవీఈఓ కోట ప్రకాశరావు ఆధ్వర్యంలో ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు నేతృత్వంలో డీఈసీ కమిటీ బొమ్మలాట శ్యామ్‌సుందర్ (ప్రిన్సిపాల్-ఆమదాలవలస), గూణ సింహాచలం (ప్రిన్సిపాల్-రణస్థలం), కీర్తి తవిటినాయుడు (ప్రిన్సిపాల్-కొయ్యాం) పక్కాగా ఏర్పాట్లు చేశారు.
- జిల్లాకు ఇప్పటికే మూడు సెట్లతో కూడిన ప్రశ్నపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకోగా.. రెండు రోజులపాటు వాటిని పోలీసు పహారాలో 33 స్టోరేజ్ పాయింట్లలో బందోబస్తు నడుమ భద్రపరిచారు.
- ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు ఆన్సర్ బుక్‌లెట్స్, ఓఎంఆర్ షీట్లు ఇతర పరీక్షల మెటీరియల్స్‌ను అధికారులు చేరవేశారు.
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌తోపాటు పోలీసు బందోబస్తు కల్పించనున్నారు. మెడికల్ సిబ్బందితో ప్రాథమిక చికిత్స సేవలు అందుబాటులో ఉంచుతున్నారు.
- పరీక్ష కేంద్రాల్లో 1480 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. వాటిని ఇంటర్‌బోర్డు, జిల్లా ఆర్ఐఓ కార్యాలయానికి స్ట్రీమింగ్ ద్వారా అనుసంధానం చేశారు.
- కొన్ని ప్రత్యేక రూట్లలో ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. హాల్‌టిక్కెట్ చూపితే పరీక్ష కేంద్రాలకు ఉచితంగా బస్సు ప్రయాణం చేసేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
- పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసివేస్తారు.
- గత ప్రభుత్వాల మాదిరిగా నేలరాతలు లేకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంది. నిరంతర విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నారు.

విద్యార్థులకు సూచనలు..

- పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, బ్లూటూత్, డిజిటల్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.
- ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. హాల్‌టికెట్‌పై ఫొటో తప్పనిసరి.
- ఇన్విజిలేటర్ల కొరత ఉన్న చోట సమీపంలోని పాఠశాలల ఉపాధ్యాయులను వినియోగించుకునేలా విద్యాశాఖ నుంచి అధికారులు అనుమతి తీసుకున్నారు.

హెల్ప్‌లైన్ కేంద్రం

విద్యార్థుల సౌకర్యార్థం జిల్లా ఆర్ఐఓ కార్యాలయంలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సమస్యలు ఎదురైతే ల్యాండ్‌లైన్: 08942-295933, సెల్‌నెంబర్: 94404 29582ను సంప్రదించవచ్చని జిల్లా ఆర్ఐఓ పి.దుర్గారావు తెలిపారు. ఇందుకోసం ప్రిన్సిపాల్ స్థాయి అధికారిని, సిబ్బందిని నియమించామని చెప్పారు.

హాల్‌టికెట్ల జారీకి నిరాకరిస్తే కఠిన చర్యలు



శ్రీకాకుళం అర్బన్: ఇంటర్మీడియెట్ హాల్ టికెట్ల నిరాకరణ పేరుతో విద్యార్థులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజులు బకాయిలు, హాజరు సరిపడలేదన్న సాకుతో ఏ ఒక్క ఇంటర్మీడియట్ విద్యార్థికైనా హాల్ టికెట్ నిరాకరించినట్లు తమ దృష్టికొచ్చినా సంబంధిత కళాశాల గుర్తింపు రద్దుతో పాటు యాజమాన్యాలపై కేసులు నమోదు చేసేలా అన్ని జిల్లాల ఇంటర్మీడియట్ అధికారులకు సిఫారసులు చేసేందుకు కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు నేతృత్వంలో సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ ఏడాది ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్ల జారీ ప్రక్రియ ప్రారంభించిందని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లు పొందవచ్చని, అయినప్పటికీ యాజమాన్యాలు వేధిస్తే apscpcr2018@gmail.com మెయిల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పారదర్శకంగా...



పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేశాం. అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, సిబ్బంది సహకరించి పరీక్షలు పక్కా నిర్వహించాలి.

– కోట ప్రకాశరావు, ఇంటర్మీడియెట్ పరీక్షల జిల్లా స్పెషల్ ఆఫీసర్, డీవీఈఓ

పకడ్బందీగా ఏర్పాట్లు..



జిల్లాలో శుక్రవారం నుంచి మొదలుకానున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. 83 కేంద్రాల్లో సీఎస్‌లు, డీవోలు, కస్టోడియన్లు, స్క్వాడ్‌లను నియమించాం. ఎప్పటికప్పుడు సీఎస్‌లు, డీవోలతో సమీక్షిస్తున్నాం. హాల్ టిక్కెట్లు వారం రోజుల నుంచి ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు, జిల్లా ఆర్ఐఓ, డీఈసీ కన్వీనర్

జిల్లాలో మండలాలు	మొత్తం పరీక్ష కేంద్రాలు	హాజరుకానున్న విద్యార్థులు	ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	సిట్టింగ్ స్క్వాడ్‌లు	ఇన్విజిలేటర్లు
30	83	45,702 మంది	10 మంది	04	1650 మంది

ఓటు హక్కే వజ్రాయుధం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వజ్రాయుధంగా మార్చుకుని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని ఈఆర్‌ఓ బి.సుదర్శన దొర పిలుపునిచ్చారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ (ఎస్‌వీఈఈపీ) కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇచ్ఛాపురం మెయిన్‌రోడ్‌లో బీఎల్‌ఓలు, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ ఎం.బి.అప్పారావు, ఎలక్షన్ డీటీ శ్రీహరి, డీటీ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. - ఇచ్ఛాపురం

పీఎం మత్స్యసంపద పథకంపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి మత్స్య సంపద పథకం అమలుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ ఉపసంచాలకుడు పి.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంప్రదాయ మత్స్యకారులకు 262 యూనిట్ల బోట్లు, ఇంజిన్లు, వలలు ఇచ్చేందుకు జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమోదం లభించినట్లు తెలిపారు. వీటితో పాటు రూ.20 లక్షల విలువైన ఐదు మొబైల్ ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్, మూడు మినీ రిటైల్ ఔట్ లెట్స్ ఇచ్చేందుకు ఆమోదం లభించిందని చెప్పారు. సమావేశంలో మత్స్యకార నాయకులు కోనాడ నరసింగరావు, అధికారులు పాల్గొన్నారు.

సైన్స్‌తోనే జీవితం



జిల్లావ్యాప్తంగా బుధవారం పలు విద్యాసంస్థల్లో జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కవిటి మండలం సీహెచ్.కపాసుకుద్దిలో ఏర్పాటు చేసిన సైన్స్‌మేళాను ఇక్కడ చూడొచ్చు. -కవిటి

రాయితీపై రాగిపిండి



శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా పంపిణీ వ్యవస్థలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టిన జగనన్న ప్రభుత్వం తాజాగా రేషన్ సరుకులతో కలిపి రాగి పిండి(చోడిపిండి)ని రాయితీపై అందజేయాలని నిర్ణయించింది. మార్చి నెలకు సంబంధించిన బియ్యం, గోధుమపిండి, కందిపప్పు, పంచదారతో పాటు రాగిపిండి కూడా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రతి నెలా మొదటి వారంలో ప్రజా పంపిణీ వ్యవస్థ వాహనాలు (ఎండీయూ) ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు అందజేస్తున్న సంగతి తెలిసిందే.

6,71,803 మందికి లబ్ధి..

ఇటీవల కాలంలో రాగి పిండి వినియోగం బాగా పెరిగింది. ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తులు రాగి పిండి ఎక్కువగా తమ ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ సరుకుల్లో రాగిపిండిని కూడా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాగిపిండి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.40పైగా ధర పలుకుతోంది. దీనిని పౌరసరఫరాల శాఖ ద్వారా కిలో రూ.11కే రాయితీపై అందజేయనున్నారు. అయితే రాగిపిండి తీసుకునే కార్డుదారులకు బియ్యం ఒక కిలో తగ్గిస్తారు. మొత్తం బియ్యం తీసుకోవాలా, బియ్యము రాగిపిండి కలిపి తీసుకోవాలా అనే ఎంపిక చేసుకునే స్వేచ్ఛను లబ్ధిదారులకే కల్పించారు. జిల్లాలో 6,71,803 మంది కార్డుదారులకు 2024 మార్చి నెలకు గాను ఇప్పటికే 405 మెట్రిక్ టన్నుల రాగి పిండిని ప్రభుత్వం కేటాయించింది.

మార్చి నుంచి పంపిణీ



బియ్యం కార్డుదారులకు మార్చి నుంచి రాగిపిండి అందుబాటులోకి వస్తుంది. దీనిపై రాయితీ కూడా ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే 1967టోల్ ఫ్రీ నంబరుకు తెలియజేయాలి.

– ఎం.నవీన్, జాయింట్ కలెక్టర్

పోషకాలు పుష్కలం..


కిలో రాగిపిండిలో 10.8 గ్రాముల ప్రోటీన్లు, 11 గ్రాముల ఫైబర్, బీ, సీ, ఈ-విటమిన్లు కాల్షియం, మెగ్నీషియమ్, ఐరన్ మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. షుగర్ వ్యాధిగ్రస్తులకు, హృద్రోగులకు అతి తక్కువ కొవ్వుశాతంతో మంచి పోషకాలను ఇచ్చే ఆహారంగా రాగి పిండి ఉపయోగపడుతుంది.

వీరికి లాభం..

రాగి పిండి ప్రధానంగా రక్తహీనతతో బాధపడే గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు పుష్కలంగా ఐరన్ అందిస్తుంది. ముఖ్యంగా మహిళల్లో ఎముకల బలహీనతను తగ్గించి దృఢత్వానికి తోడ్పాటునందిస్తుంది. శారీరక శ్రమ చేసే వారికి, క్రీడాకారులకు తక్షణ శక్తిని అందిస్తుంది.

వాసుదేవుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- ఆంజనేయునికి అభిషేకంతో అంకురార్పణ
- 100 మంది పోలీసులతో బందోబస్తు



వాసుదేవునికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మందస: మండల కేంద్రం మందసలో వాసుదేవ పెరుమాళ్ స్వామి 15వ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులు జైశ్రీమన్నారాయణ నామస్మరణతో ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుప్రభాతసేవ, ప్రాతఃకాలారాధన, నివేదన, గోష్ఠి, యాగశాలలో ద్వారతోరణ, నిత్యపూర్ణాహుతి, బలిహారణ, శాత్తుముర్రై, ప్రసాదగోష్ఠి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు, అర్చకులు సచ్చిదానందపాడి, ఘనశ్యాం ఆధ్వర్యంలో శ్రీదాసాంజనేయ ఆలయాన్ని నిర్మించిన డోకి రామారావు, భాగ్యలక్ష్మి దంపతులతో పాటు భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 100మంది పోలీసులతో భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో రాజకీయ నాయకుల తాకిడి ఉంటుందన్న సమాచారం ఆధారంగా ఎస్ఐ బి.అనిల్‌కుమార్, కె.ఢిల్లేశ్వరరావులు ఆలయ పరిసరాలను పర్యవేక్షించారు. సీఐ, ముగ్గురు ఎస్ఐలు, ఏఎస్ఐ/హెచ్‌సీలు 9 మంది, 90 మంది కానిస్టేబుల్స్‌ను బ్రహ్మోత్సవాల్లో బందోబస్తుకు నియమించినట్లు ఎస్ఐ చెప్పారు.



లబ్ధిదారులకు రైతు భరోసా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

3,21,930 మంది రైతులకు రూ.64.47 కోట్లు

- వరుసగా ఐదో ఏడాది రైతు భరోసా- పీఎం కిసాన్ నిధులు విడుదల
- హర్షం వ్యక్తం చేసిన అన్నదాతలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం వై.ఎస్.ఆర్.రైతు భరోసా- పి.ఎం.కిసాన్ పథకం కింద రైతులు, కౌలు రైతులు, అటవీ భూముల సాగుదారులకు ఇస్తున్న ఐదో ఏడాది 2023-24 మూడవ విడత ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 మూడవ విడతలో రైతు భరోసా-పి.ఎం.కిసాన్ ద్వారా 3,21,930 రైతు కుటుంబాలకు రూ.64.47కోట్లు పెట్టుబడి సాయాన్ని రైతుల వ్యక్తిగత ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. అదే విధంగా, 1,25,655 మంది రైతులకు సున్నావడ్డీ పంట రుణ రాయితీ కింద రూ.18.25 కోట్లు జమ చేసినట్లు వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు రైతు పండించే పంట కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. విత్తనం నుంచి విక్రయం వరకు ఆర్‌బీకేలు కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అనంతరం రైతులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నేతాజీ, అగ్రిమిషన్ సభ్యుడు గొండు రఘురామ్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్



నాగార్జున యాదవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక వసతుల సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ నాగార్జున యాదవ్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆరోగ్య ప్రదాతగా ఇక్కడ వెలిసిన ఆదిత్యుని దర్శనం సంతృప్తినిచ్చిందని నాగార్జున యాదవ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

అగ్నిపథ్‌కు ఉచిత శిక్షణ



సుమన్‌రెడ్డిని సత్కరిస్తున్న సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

ఇచ్ఛాపురం: దేశరక్షణలో విధులు నిర్వహించేందుకు ఉద్దేశించిన అగ్నిపథ్‌లో చేరేందుకు ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు ఇచ్ఛాపురంపట్టణంలోని శ్రీ సురంగి రాజా క్రీడామైదానం ఆవరణలో ఉచితంగా శిక్షణ అందిస్తామని మాజీ సైనికోద్యోగి కెప్టెన్ సుమన్‌రెడ్డి అన్నారు. ఇక్కడి మైదానంలో సుమన్ రెడ్డి రూ.మూడు లక్షలు వెచ్చించి ఓపెన్ ఎయిర్ జిమ్ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బుధవారం సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో సుమన్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, వైద్యులు గోవింద్, చాట్ల లోహిదాస్‌రెడ్డి, మైదాన అభివృద్ధి కమిటీ ప్రతినిధులు బత్తుల వెంకటరమణ, అంజి, తిరుపతి, జయకృష్ణ, సోమేష్, నగేష్, క్రీడాకారులు, వాకర్స్ పాల్గొన్నారు.

మినీస్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్

మెళియాపుట్టి : మండల కేంద్రం మెళియాపుట్టిలోని సాయిమందిరం ఆవరణలో ఉన్న స్థలంలో మినీస్టేడియం ఏర్పాటుకు జాయింట్ కలెక్టర్ నవీన్ బుధవారం స్థల పరిశీలన చేశారు. స్థల విస్తీర్ణం, స్టేడియానికి అవసరమైన భూమి వివరాలపై ఆరా తీశారు. అధికారులతో కలిసి మ్యాప్‌ను పరిశీలించారు. ఎత్తుపల్లాలతో ఉన్నప్పటికీ గతంలో మైదానం నిర్మాణానికి ఇదే స్థలం ఎంపిక చేయాలని గ్రామస్తులు వినతిపత్రాలు అందించినట్లు అధికారులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహశీల్దార్ జానకమ్మ, ఆర్ఐ వైకుంఠరావు, వీఆర్వోలు అన్నాజీరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ సీసీఎస్ మెంబర్‌గా గోవిందరాజులు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీస గోవిందరాజులు

గార : ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టివ్ కమిటీ స్టేట్ మెంబర్ (జాతీయ స్థాయి) నియమితులైన గార మండలం కొర్ని పంచాయతీ సర్పంచ్ పీస గోవిందరాజులు (గోపి) బుధవారం కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నియామక వివరాలను తెలియజేశారు. అనంతరం మంత్రి మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎంపీ మిధునరెడ్డిలకు గోవిందరాజులు ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి బాటలో..!

- పొన్నాడ-బొంతలకోడూరు సమస్యకు శాశ్వత పరిష్కారం
- బీటీ రోడ్డు నిర్మాణంతో పది గ్రామాలకు తీరిన ప్రయాణ ఇబ్బందులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



బొంతలకోడూరు తారు రోడ్డు



ఎచ్చెర్ల క్యాంపస్ : గత పాలకులు విస్మరించిన రహదారి సమస్యకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఎచ్చెర్ల మండలం పొన్నాడ నుంచి బొంతలకోడూరు వెళ్లే రోడ్డుకు మోక్షం లభించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో నాగావళి నది నుంచి ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు, టిప్పర్ల కారణంగా అప్పట్లో రోడ్డు మొత్తం గోతుల మయంగా మారింది . టీడీపీ పాలనలో 2014 నుంచి 2019 మధ్య రాష్ట్ర మంత్రిగా కిమిడి కళావెంకటరావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా చౌదరి ధనలక్ష్మి ఉండేవారు. రోడ్డు బాగు చేయాలని పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. చివరకు వర్షాకాలంలో రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేసినా టీడీపీ నేతలు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. 2019 ఎన్నికల ముందు ఎమ్మెల్యే అభ్యర్థిగా గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్ ఎలక్షన్ ప్రచారం కోసం గ్రామానికి వెళ్లగా రోడ్డు సమస్య వీరి దృష్టికి తెచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు .

మాటకు కట్టుబడి..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గతంలో ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామంలో రోడ్డు నిర్మించారు. రూ. 4.98 కోట్లు పీఎంజీఎస్‌వై ఫేజ్-3, బ్యాచ్-2 కింద నిధులు మంజూరు చేశారు. మొత్తం 7.80 కిలోమీటర్లు రోడ్డు కాగా , గ్రామీణ లిమిట్స్‌లో సిమెంట్ రోడ్డు 3.72 కిలోమీటర్లు, గ్రామీణ హద్దు మినహాయించి తారు రోడ్డు 4.06 కిలోమీటర్లు నిర్మించారు. 2022 డిసెంబర్ 29న మంత్రి ధర్మాన ప్రసాదరావు రోడ్డును ప్రారంభించారు. దీంతో బొంతలకోడూరు, పాత పొన్నాడ, ముద్దాడపేట, బింగిపేట, పంచిరెడ్డిపేట, రుప్పపేట, పాతదిబ్బలపాలెం, లావేటిపాలేం, చినరుప్పపేట, కాళింగపేట తదితర గ్రామాల ప్రజలకు రోడ్డు సమస్య తీరింది.



గ్రామం పరిధిలో నిర్మించిన సిమ్మెంట్ రోడ్డు



టీడీపీ పాలనలో రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన తెలియ జేస్తున్న స్థానికులు(ఫైల్)

మర్చిపోలేం..



గతంలో మా ఊరి రోడ్డు చెరువుకంటే దారుణంగా ఉండేది. వాహనచోదకులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చొరవతో రోడ్డు నిర్మాణం జరిగింది. ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సాయం మరువలేనిది.

– పంచిరెడ్డి రాంబాబు, సర్పంచ్, బొంతలకోడూరు, ఎచ్చెర్ల మండలం

ప్రతిష్ఠాత్మకంగా శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాలు

- సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి
- అధికారులతో సమీక్షలో శ్రీకాకుళం ఆర్డీఓ రంగయ్య



స్వామివారిని దర్శించుకుంటున్న ఆర్డీఓ రంగయ్య

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మార్చి 8 నుంచి 11 వరకూ జరగనున్న శివరాత్రి ఉత్సవాలు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని శ్రీకాకుళం ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య అన్నారు. బుధవారం శ్రీముఖలింగంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన పలు శాఖల అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఉత్సవాల నిర్వహణలో ప్రజాప్రతినిధులు, పాలక మండలిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఈ నెల 29న స్వామివారి ఉత్సవ పనులకు పందిరిరాట వేసి అనంతరం పనులు ప్రారంభిస్తామన్నారు. ఉచిత ప్రసాదాలు, తాగునీరు, క్యూలైన్లు, చలువ పందిళ్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. 108, 104 అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

చక్రతీర్థ స్నానాలపై ప్రత్యేక శ్రద్ధం..

శివరాత్రి ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు మార్చి 11న పక్షి తీర్థం(వంశధార నదిలో) మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థ స్నానాలు(త్రిశూల్) జరగనున్నాయని, లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు అదనంగా నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల పాటూ వైద్య శిబిరాలు ఉండాలన్నారు. ఉత్సవాల సమయంలో శ్రీముఖలింగం, పరిసర గ్రామాలలో మద్యం అమ్మకాలు నిరోధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో దేవదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, సీఐ బూర ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, పాలక మండలి చైర్మన్ పంచిరెడ్డి లింగమూర్తి, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, ఈఓ ప్రభాకరరావు, ఎంపీడీఓ దామోదరరావు, వైద్యాధికారులు శ్రీకాంత్, ప్రసాద్, అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాంకేతిక అంశాలపై పట్టు అవసరం



ల్యాబ్‌లో పరికరాలు పరిశీలిస్తున్న ఆర్‌జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్ : సాంకేతిక విద్యలో విద్యార్థులు ప్రయోగాలకు ప్రాధాన్యమివ్వాలని రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక కేంద్రం రాష్ట్ర చాన్సలర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్‌ను బుధవారం సందర్శించారు. జాతీయ సైన్స్ డే వేడుకలు సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం క్యాంపస్‌లో నిర్వహించిన ది ఇంటర్‌సెక్షన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎండ్ ది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అన్న అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక అంశాల్లో పట్టు సాధించాలని, ప్రస్తుతం వస్తున్న పారిశ్రామిక మార్పులు గమనించాలని సూచించారు. అనంతరం క్యాంపస్‌లో నిర్మిస్తున్న భవనాలు, ల్యాబ్ పనులు, మెస్ నిర్వహణ పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధనబాలాజీ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్ వర్సిటీ ఫిషరీస్ సైన్స్ కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు



సెంచూరియన్ వర్సిటీ ఫిషరీస్ విభాగం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఒడిశాలోని పర్లాకిమిడిలో ఉన్న ప్రతిష్ఠాత్మక సెంచూరియన్ యూనివర్సిటీ మరో ఘనతను సొంతం చేసుకుంది. కళాశాలలో ఉన్న బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సు (ప్రోగ్రాం)కు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) గుర్తింపుతోపాటు అనుమతి లభించింది. ఫిషరీస్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆక్వా కల్చర్‌పై విద్యార్థులు పరిశీలనతోపాటు ప్రాక్టికల్స్‌గా నేర్పించేందుకు తాజా గుర్తింపు దోహదపడుతుందని భావిస్తున్నారు. బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ డిగ్రీ కోర్సులో ఆక్వా కల్చర్, ఫిషరీస్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్, ఫిష్ ప్రోసెసింగ్ టెక్నాలజీ, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఫిష్ ఇంజనీరింగ్, ఆక్వాటిక్ యానిమల్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్, ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ తదితర సబ్జెక్టులు ఈ డిగ్రీ ప్రోగ్రాంలో భాగంగా ఉంటాయని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు లభించడం పట్ల ప్రొఫెసర్ డి.ఎస్.రావు సంతోషం వ్యక్తం చేశారు.

జిల్లాకు చంద్రబాబు చేసిందేమీ లేదు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఇప్పిలిలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: టీడీపీ హయాంలో ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల పాలనలో శ్రీకాకుళం జిల్లాకు ఏ ప్రాజెక్టు తీసుకొచ్చావో చెప్పగలవా చంద్రబాబు అంటూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ధ్వజమెత్తారు. శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలిలో రూ.62 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్ మెడికల్ కాలేజీ, అంబేడ్కర్ యూనివర్సిటీ, వంశధార ప్రాజెక్టు, 35 రహదారి-వంతెనలు, రహదారుల పనులకు నిధుల సేకరణ, రూ.700 కోట్లతో ఉద్దాన ప్రాంతానికి సర్ఫేస్ వాటర్, రూ.4వేల కోట్లతో మూలపేట పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, గ్రామ వార్డు సచివాలయాల ఏర్పాటు.. ఇలా ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో స్వర్ణయుగం తీసుకొచ్చామని వివరించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబు మరోసారి బూటకపు హామీలతో ముందుకు వస్తున్నారని, వాటిని నమ్మవద్దని హితవుపలికారు. రాజధాని పేరుచెప్పి వ్యాపారం చేసుకొనే చంద్రబాబుకు ప్రజల స్థితిగతులను, వారి జీవన ప్రమాణాలను మార్చే ఆలోచన లేదన్నారు. మూడు రోజులు క్రితం శ్రీకాకుళంలో రా..కదలిరా పేరిట ఏర్పాటు చేసిన బహిరంగ సభలో 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మాట్లాడే మాటలు వింటే నవ్వు వస్తోందన్నారు. శ్రీకాకుళం పొట్టి శ్రీరాములు మార్కెట్‌ను గత పాలకులు గాలికొదిలేస్తే తామే అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీను, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, సర్పంచ్ లోలుగు శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, చల్లా రవికుమార్, గంగు నరేంద్రకుమార్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



విద్యుత్ కాంతుల వెలుగుల్లో వేదిక

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లోని మల్టీపర్పస్ గ్రౌండ్స్‌లో మంగళవారం రాత్రి జరిగిన గజజ్యోతి వెట్ ఫెస్టివల్ – 2024 విద్యార్థులను హోరెత్తించింది. వేడుకలను వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎస్.రావు ప్రారంభించగా, రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం గత మూడు రోజులుగా జరిగిన వివిధ స్పోర్ట్స్ ఈవెంట్స్, డ్రామా, డ్యాన్స్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రారంభమైన స్టార్ నైట్ సాంస్కృతిక ప్రదర్శనల్లో బాలీవుడ్ పాప్ సింగర్ మధుర్ శర్మ, మరో సింగర్ చందన్ జైస్వాల్ (ముంబాయి) పాటలతో అలరించారు. అదేవిధంగా క్యాంపస్‌లో ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యార్థులు ఆస్వాదించారు.

రేపటి నుంచి ఎంఎస్ఎంఈల సర్వే

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, దీనిలో భాగంగా మార్చి 1 నుంచి సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల(ఎమ్ఎస్ఎమ్ఈ) సర్వే చేయనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.వి.రఘునాధరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్యాక్టరీలు, సేవ, సర్వీస్, అన్ని ట్రేడింగ్ యూనిట్లలో సర్వే చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, మున్సిపాలిటీల్లో ఎమినిటి సెక్రటరీలు సర్వే చేస్తారని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయ స్థానం



పతకాలతో క్రీడాకారులు

కాశీబుగ్గ : ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఖోఖో పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టుకు తృతీయ స్థానం లభించింది. సామర్లకోటలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో జిల్లా జట్టు ఆద్యంతం పోరాట పటిమ కనబరిచిందని కోచ్ బొండాడ తిరుమలరావు తెలిపారు. పలాస ప్రభుత్వ మైదానంలో శిక్షణ పొందిన జట్టు ఆడుదాం ఆంధ్రా మండల, నియోజకవర్గ, డివిజన్, జిల్లా స్థాయిలు దాటుకుంటూ రాష్ట్ర స్థాయిలో పతకం సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

సమాజ సేవకు సైన్స్ ఉపయోగపడాలి



విజేతలకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు, ఆదిత్య కళాశాల యాజమాన్యం

టెక్కలి : సామాజిక సేవకు మాత్రమే సైన్స్‌ను ఉపయోగించాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాలోని 23 పాఠశాలలకు చెందిన అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థుల సైన్సు ప్రదర్శన నిర్వహించారు. సమగ్రశిక్ష, పాఠశాల విద్య, ఎస్‌సీఈఆర్‌టీ, యూనిసెఫ్, విజ్ఞాన్ ఆశ్రమ్ సారథ్యంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సహకారంతో నిర్వహించిన ఈ ప్రదర్శనలో 23 పాఠశాలల నుంచి అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ. 5000, 4000, 3000 చొప్పున ఆదిత్య కళాశాల యాజమాన్యం నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యునిసెఫ్ ప్రతినిధి సుదర్శన్‌రావు మాట్లాడుతూ జిల్లాలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌కు ఆదిత్య కళాశాల సహకారం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్.జయప్రకాష్, డి.శ్రీరాములు, డి.రఘువీర్, పి.సుమన్, డి.భానుచంద్ర, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి మూడు ప్రాజెక్టులు..

అటల్ ఇన్నోవేషన్ ప్రదర్శనలో భాగంగా మూడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు సైన్స్ అధికారి కుమారస్వామి వెల్లడించారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.గాయత్రీ, జస్వంత్‌పాత్రో, డిల్లేశ్వర్రావు రూపకల్పన చేసిన విమెన్ సేఫ్టీ స్మార్ట్ పవర్ స్టిక్ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రోహిత్ శ్రీసాయి, ప్రీతమ్, నితీష్ రూపకల్పన చేసిన మల్టీ ఫంక్షనల్ అగ్రికల్చరల్ రోబోట్ ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. శ్రీకాకుళం ఇప్పిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థులు డి.నవీన్ కుమార్, డి.దివాకర్, పి.వికాస్‌కుమార్ రూపొందించిన సన్ ట్రాకింగ్ సోలార్ సిస్టం తృతీయ స్థానం లభించింది.

మెడికల్ షాపులో చోరీ

- పోలీసులకు చిక్కిన దొంగ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు పట్టుకుని విచారించగా దొంగ అని తేలింది. సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు చెప్పిన వివరాల మేరకు.. ఈ నెల 26న అర్ధరాత్రి దాటాక డేఅండ్ నైట్ కూడలి సమీపంలోని మహాలక్ష్మి మెడికల్ షాపులో చోరీ జరిగింది. షాపు వెనుక భాగాన షట్టర్ పగులగొట్టి లోపలికి వెళ్లి రూ.83,900 నగదు దోచుకున్నారు. ఈ విషయమై షాపు యజమాని ముద్దాడ రామకృష్ణ బుధవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపు ముందు భాగాన ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా చోరీ చేసింది ఒక్కరే అని గుర్తించారు. బుధవారం సాయంత్రం చోరీ చేసిన వ్యక్తి ఆర్ట్స్ కళాశాలలో అనుమానంగా తిరుగుతున్నాడన్న సమాచారం రావడంతో ఎస్ఐ హరికృష్ణ, మరో నలుగురు కానిస్టేబుళ్లు వెళ్లి మాటువేసి పట్టుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడకు చెందిన దేవాన బుజ్జిగా గుర్తించారు. నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించనున్నామని పోలీసులు తెలిపారు.

డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా బొడ్డేపల్లి సురేష్



నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ సంక్షేమ సంఘం డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ బొడ్డేపల్లి సురేష్‌ను నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు బుధవారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడం బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఇప్పటికే తన వంతుగా పేదలకు ఉచిత వైద్యశిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సురేష్ నియామకంపై సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన దేవభూషణ్‌లు హర్షం వ్యక్తం చేశారు.